క్లుప్తంగా

రోడ్ల అభివృద్ధికి హామీ

మడకశిర: నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి ఆర్‌అండ్‌బీ, పీఆర్, జాతీయ రహదారులశాఖలకు చెందిన ఉన్నతాధికారులు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తిప్పేస్వామి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడలో ఆర్ అండ్‌బీ ఈఎన్‌సీ వేణుగోపాల్‌రెడ్డి, సీఈలు నయీమ్‌ఉల్లా, శ్రీనివాసరెడ్డి, పీఆర్ ఈఎన్‌సీ బాలునాయక్, జాతీయ రహదారులశాఖ ఈఎన్‌సీ రామచంద్రుడును కలిసి మడకశిర నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు రోడ్ల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

గిరిజా కల్యాణ మహోత్సవం

మడకశిర: పట్టణంలోని షిరిడీ సాయిబాబా, దత్త బాణలింగేశ్వర స్వామి సన్నిధిలో గురువారం గిరిజా కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. దేవరకొండ శేషాద్రిశాస్త్రి ఆధ్వర్యంలో పలువురు దాతల సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రేత అరెస్ట్

రొద్దం: కోగిర గ్రామానికి చెందిన నరసింహులు అనే వ్యక్తి గురువారం నాటు సారా విక్రస్తుండగా అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నాగస్వామి చెప్పారు. అతని నుంచి 20 లీటర్ల నాటుసారా, స్కూటీ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

22న సామాజిక తనిఖీ బహిరంగ సభ

చిలమత్తూరు: ఈనెల 22వ తేదీన ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో చిలమత్తూరులో కాకుండా హిందూపురంలో ఓపెన్ ఫోరం నిర్వహిస్తామన్నారు.

వీధి లైట్ల ఏర్పాటు

చిలమత్తూరు: మండలంలోని దేమకేతేపల్లి పంచాయతీ యగ్నిశెట్టిపల్లిలో నెలకొన్న పలు సమస్యలను సర్పంచ్ ఈడిగ తిరుమలేష్ పరిష్కరించారు. గురువారం గ్రామంలో వీధి లైట్లు ఏర్పాటు చేయించారు. అదే విధంగా మురుగునీటి కాలువలను శుభ్రం చేయించారు. తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించారు. తాగునీటి ట్యాంకుల వద్ద నీటి వృథాను అరికట్టారు. ఎస్సీ కాలనీలో విద్యుత్ కనెక్షన్లు లేని పలు గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించారు.

నేడు గృహ సారథులకు శిక్షణ

పెనుకొండ: అమ్మవారుపల్లిలోని కియా పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న మైదానంలో గుట్టూరు, మునిమడుగు, ఎర్రమంచి, దుద్దేబండ, వెంకటగిరిపాళ్యం పంచాయితీల్లోని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్‌లకు శుక్రవారం ఉదయం శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగలూరుబాబు, టౌన్ కన్వీనర్ బోయనరసింహతో పాటు సచివాలయాల పట్టణ టౌన్ కన్వీనర్‌లు రాము, శ్యాంనాయక్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పట్టణంలోని సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులకు శిక్షణ ఉంటుందన్నారు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ హాజరవుతారన్నారు.

పంటల సాగులో మెలకువలు పాటించాలి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

రొళ్ల: మండల వ్యాప్తంగా బోర్ల కింద వేరుశనగ పంట సాగు చేసిన రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి పొందవచ్చని వ్యవసాయ శాఖాధికారులు సూచించారు. గురువారం మండలంలోని గుడ్డగుర్కి, దొడ్డేరి రైతు భరోసా కేంద్రాల పరిధిలో సాగు చేసిన వేరుశనగ, రాగి, మొక్కజొన్న తదితర పంటలను పరిశీలించారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు వేసుకోవాలన్నారు. పంటల సాగులో సందేహాలుంటే అందుబాటులో ఉండే వీఏఏలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ వీఏఏ ఫకృద్దీన్, వీహెచ్ఏ కళ్యాణ్, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయండి



సోమందేపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పని చేయాలని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పిలుపునిచ్చారు. గురువారం గౌనివారిపల్లి, కమ్మవారిపల్లి, వానవోలు, వానవోలు తండా, గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు వానవోలు, గోరంట్ల షాదీమహల్ ఫంక్షన్ హాల్ లో శిక్షణ తరగతులు నిర్వహించారు. పెనుకొండ నియోజకవర్గ పరిశీలకుడు బాబురెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. మార్చి 18 వతేది నుంచి జరిగే జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను ఏవిధంగా మోసం చేశారో ప్రజలకు వివరించలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపునకు కృషి చేయాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు పాలేజయరాంనాయక్, గోరంట్ల మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు నూర్‌మహమ్మద్, ఏడీసీసీబీ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీల అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్ల మండలాధ్యక్షుడు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత

సోమందేపల్లి: మూడున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ సూచించారు. మండల కేంద్రంలో గురువారం 'నువ్వే మా నమ్మకం జగనన్న' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీకు వారథులుగా సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులు వ్యవహరించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయని ప్రభుత్వ పథకాలు ఏపీలో అమలవుతున్నాయన్నారు. తమకు మనుగడ ఉండదని ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజలకు వివరించాలని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ అశోక్, వైస్ ఎంపీపీ వెంకటనారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, నరసింహమూర్తి, సింగిల్ విండో చైర్మన్ కొల్లప్ప, సచివాలయాల కన్వీనర్ ఇమామ్‌వలి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించండి

సోమందేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాల అమలుకు సమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ తెలిపారు. దాదాపు రూ.5 కోట్లతో మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి కొత్తపల్లి క్రాస్ వరకు నిర్మించి రోడ్డును ప్రారంభించారు. అనంతరం చాకర్లపల్లి వద్ద ఉన్న జగనన్న లే అవుట్‌లో లబ్ధిదారుల సౌకర్యార్థం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. కాలనీల్లో మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, ఎంపీపీ గంగమ్మ, సర్పంచ్ గంగాదేవి, జెడ్పీటీసీ అశోక్, వైస్ ఎంపీపీ వెంకటనారాయణ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు రఫీక్, ట్రాన్స్‌కో ఏఈ సంజీవప్ప తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రారెడ్డికి మద్దతుగా ప్రచారం



ఎంపీడీఓ కార్యాలయంలో కరపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హిందూపురం టౌన్: వైఎస్సార్‌సీపీ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం, పంచాయతీ రాజ్, సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో వెన్నపూస రవీంద్రారెడ్డి సోదరుడు వెన్నపూస శివారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం చేపట్టారు. అధికారులను, ఉపాధ్యాయులను, సిబ్బందిని కలిసి వెన్నపూస రవీంద్రారెడ్డికి ఓటు వేయాలని కోరారు. భారీ మెజార్టీతో గెలిపించాలని కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నిజాముద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి

గోరంట్ల: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ఆయన సోదరుడు శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. గురువారం వారు మండలంలోని సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: వానవోలు పంచాయతీలోని కొలిమిపల్లి గ్రామానికి చెందిన పలు కుటుంబాలు గురువారం పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. టీడీపీ మద్దతుదారులు గంగులప్ప, అంజినప్ప, వెంకటేశు, నరసింహప్ప, సోమశేఖర్, సుధాకర్, చంద్రాయుడు, నరేష్, మునెమ్మ, చెన్నకేశవులు, పెద్దవెంకటేశులు, గోపాల్ తదితరులుకు ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. జెడ్పీటీసీ సభ్యుడు పాలేజయరాంనాయక్, వానవోలు సర్పంచ్ శ్రీరాములు, ఉప సర్పంచ్ బాబు, వానవోలు సొసైటీఅధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ రఘువేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి



మాట్లాడుతున్న ఏఓ మంజునాథ

అమరాపురం: ప్రస్తుతం ఎండకాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీపీ ఈరన్న ఎంపీడీఓ మునిస్వామి తదితరులు అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్య రాకుండా అధికారుల ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఏఓ మంజునాథ మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు తప్పక ఈ క్రాప్ నమోదు చేయించాలన్నారు. ఈ- సర్వీసస్ పథకం కింద రైతులు గ్రూపులు ఏర్పాటు చేసుకుంటే ట్రాక్టర్, వ్యవసాయ పనిముట్లను 40 శాతం సబ్సిడీతో అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకుముందు పలు శాఖల అధికారులు నివేదిక చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, వైద్యాధికారి భార్గవ్, ఉపాధి అధికారి హెన్రీ, ఎంఈఓ సత్యనారాయణ, వైస్.ఎంపీపీ క్రిష్ణమూర్తి, సభ్యులు తిప్పేస్వామి, ఈరన్న, మంజుల, కోఆప్షన్ సభ్యుడు రసూల్‌బాషా , అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

బలిజలు అన్ని రంగాల్లో రాణించాలి



విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

సోమందేపల్లి: బలిజలు అన్ని రంగాల్లో రాణించాలని అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం గుడిపల్లి గ్రామంలో కృష్ణదేవరాయ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలిజ కాపు కులస్తులు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు ముద్దప్ప, అమర్, కళ్యాణ్, రమేష్, ఆదిమూర్తి, అశ్వర్థ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు సౌండ్ సిస్టం అందజేత



సౌండ్ సిస్టం వితరణ చేసిన దృశ్యం

పెనుకొండ: స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వైర్లెస్ సౌండ్ సిస్టంను పట్టణానికి చెందిన త్రివేణి, నీరజ వితరణ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నీలం రమేష్‌రెడ్డి గురువారం తెలిపారు. పెనుకొండ తొలి సర్పంచ్ అయిన కురిడీ పద్మనాభయ్య కుమార్తెలు త్రివేణి, నీరజ వారి తండ్రి జ్ఞాపకార్థం రూ. 20 వేలు విలువజేసే సౌండ్ సిస్టం అందజేసారన్నారు. ఇదిలా ఉండగా 2022–2023 విద్యా సంవత్సరానికి కళాశాలలో అడ్మిషన్‌లు పొందేందుకు ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు ఈ నెల 20న కళాశాలలో ఓపెన్ డే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులు కళాశాలలోని వసతులు, అధ్యాపకుల అర్హతలు తెలుసుకుని డిగ్రీలో అడ్మిషన్ పొందాలని సూచించారు.

క్రీడాకారులకు సన్మానం



క్రీడాకారులతో అధ్యాపకులు

లేపాక్షి: మండల పరిధిలోని చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వసంత, వివిధ క్రీడల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఆరుగురు క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుడు శివకుమార్‌ను గురువారం పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాల, ఊరికి మంచిపేరు తీసుకువచ్చారని ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ కొనియాడారు.

రహదారికి మరమ్మతులు

మడకశిరరూరల్: మండలంలోని ఎగువ రామగిరి నుంచి ఏఆర్ రొప్పం గ్రామం దాదాపు రెండు కిలోమీటర్లు ప్రజలు ఇబ్బంది పడకుండా రహదారి సౌకర్యం కల్పిస్తున్నామని ఎంపీపీ కవిత తెలిపారు. గురువారం మధ్యాహ్నం జేసీబీతో కంప చెట్ల తొలగింపును ప్రారంభించామన్నారు. ఆమె మాట్లాడుతూ ఎగువ రామగిరి నుంచి ఏఆర్ రొప్పం గ్రామానికి వెళ్లడానికి పదేళ్ల నుంచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల పరిషత్ నిధులతో కంప చెట్ల తొలగించి, మట్టి వేసి రహదారి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. దీంతో ప్రజలు, విద్యార్థులు, రైతులకు సుకూలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గీత, ఎంపీటీసీ కామరాజు, మండల బీసీ సెల్ నాయకుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహా శివరాత్రికి ముస్తాబు



రొద్దం పెన్నానది ఒడ్డున రుద్రపాద శివాలయం

రొద్దం: మండల కేంద్రంలో పెన్నానది ఒడ్డున వెలసిన రుద్రపాద ఆశ్రమం మహా శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. 18న రాత్రి సత్యసాయి, శ్రీరామ భక్త మండలి, షిర్డీసాయి భక్త మండలి ఆధ్వర్యంలో భజనలు, సుబ్బరాయప్పకొట్టాల వారు చెక్కభజన, హరికథ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం శివపార్వతలకు అర్చనలు, అభిషేకాలతో ప్రత్యేక పూజలు చేపడతారు. ఇక్కడ శివని పాదం ఉండడంతో రుద్రపాద ఆశ్రమం అని పేరు వచ్చింది. తూర్పు వైపు నుంచి రుద్రుడు నరకాసురుడిని భస్మం చేయడానికి తరుముకుంటూ వెళ్లే క్రమంలో ఇక్కడ పెన్నానది ఒడ్డున పాదం మోపినట్లు చరిత్ర చెబుతోంది. శివ పాదానికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు దర్శనం చేసుకుంటారు. రాతి బండపై శివుని పాదం ఉండటంతో ఇక్కడి ప్రత్యేకత.



పావగడ: కొండపై రామలింగేశ్వరస్వామి ఆలయం

పావగడ: మండలంలోని కామనదుర్గంపై కొలువు తీరిన రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శివరాత్రి వేడుకలు ఈ నెల 18, 19న ఘనంగా నిర్వహించనున్నారు. శివరాత్రి వేడుకలను పురస్కరించుకుని ఆలయం ముస్తాబవుతోంది. ఆలయ సేవా ట్రస్ట్ అధ్యక్షుడు మాధవ రెడ్డి, కార్యదర్శి సురేశ్‌రెడ్డి, వ్యవస్థాపకుడు అనంతరాజు, ట్రెజరర్ శివానందరెడ్డి, రాంపేట గ్రామ కమిటీ సభ్యులు ఆలయ ముస్తాబులో నిమగ్నమయ్యారు. 18వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఆలయంలో గణపతి ప్రార్థనతో పూజా కార్యక్రమాలు ప్రారంభిస్తారు. 19వ తేదీ ఉదయం 8 గంటలకు స్వామికి పంచామృతాభిషేకం, మహా మంగళారతి, సామూహిక సమారాధన పూజలు జరుగుతాయని అర్చకుడు బసవరాజప్ప తెలిపారు.

హిందూ ధర్మ ప్రచారం

రొద్దం: మండల కేంద్రంలో త్రైత సిద్ధాంత కర్త ప్రబోధానంద బోధించిన హిందూ ధర్మంపై గురువారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత భగవద్గీత ఆధ్మాత్మిక గ్రంథాలను ఇంటింటా పంపిణీ చేశారు. ప్రబోధ సేవాసమితి ధర్మవరం కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సభ్యులు లోకేష్, బాలకృష్ణ, ప్రసాద్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

సోమందేపల్లి: మంలంలోని వెలిదడకల గ్రామం వద్ద నాలుగు లైన్ల జాతీయ రహదారి విస్తరణ పనులను జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ గురువారం పరిశీలించారు. త్వరలో పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో రహదారి నిర్మాణానికి అవసరమయ్యే భూములు సరిహద్దులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ శ్రీకాంత్, వీఆర్వో వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సీలు లేని వాహనాలు కొనొద్దు

పెనుకొండ: ఆర్‌సీలు లేని వాహనాలు కొనరాదని ఎస్ఐ రమేష్ గుజిరీ వ్యాపారులకు సూచించారు. ఇటీవల పట్టణంలో గుజిరీ వ్యాపారులు రాగి, విద్యుత్ మోటార్లు, డ్రిప్ పరికరాలు, ఆర్‌సీలు లేని వాహనాలు, కొంటున్నారని, దీనివల్ల ప్రజలు, రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రజలు ఇబ్బంది పడే పని చేయొద్దన్నారు.

సీడీపీఓపై విచారణ

పెనుకొండ: గతంలో పెనుకొండ సీడీపీఓగా పని చేసిన ప్రభావతిపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో గురువారం అంగనవాడీ కార్యకర్తలు, ఇతర సిబ్బందితో ఐసీడీఎస్ ఆర్‌జేడీ పద్మజ, కర్నూలు పీడీ కుమారి విచారణ చేపట్టారు. సిబ్బందితో పలు విషయాలపై ఆరా తీసిన ఉన్నతాధికారులు సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు ఇచ్చిన పలు సమాధానాలను నమోదు చేసుకున్నారు. పౌష్టికాహార సరఫరా, కేంద్రాల నిర్వహణలో లోపాలు, శాఖాపరంగా ఉన్న ఇతర విషయాలను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.

ఘనంగా శ్రీకృష్ణ దేవరాయల జయంతి



రొళ్ల: మండల కేంద్రం గుడిబండ ప్రధాన రోడ్డు పక్కన గ్రంథాలయం ఆవరణంలో ఉన్న శ్రీకృష్ణదేవరాయుల జయంతి వేడుకలను గురువారం బలిజ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు కృష్ణదేవరాయుల విగ్రహం ఎదుట బలిజ సంఘం నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లను పంచి పెట్టారు. కార్యక్రమంలో బలిజ సంఘం మండల అధ్యక్షుడు డా.వెంకటరమణప్ప, ఉపాధ్యక్షుడు గోవిందరాజు, నాయకులు పట్టాభి, పవన్‌కుమార్, శేఖర్, దాసప్ప, రామక్రిష్ణారెడ్డి, నాగేంద్ర, మురళి, బాబు, శంకరప్ప, శ్రీనివాస్, నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన చౌళూరు మధుమతిరెడ్డి, నాగభూషణరెడ్డి

హిందూపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమ పాలనపై ప్రజల్లో సంతృప్తిగా ఉన్నారని, వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి అన్నారు. గురువారం తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మధుమతి రెడ్డి, నాగభూషణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా పని చేస్తున్నామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి తెలిపారు. జగన్ మోహన్‌రెడ్డి పాలనను ప్రజల్లోకి తీసుకెళ్తూ సంక్షేమ పథకాలను వివరిస్తున్నామన్నారు. రాబోయే ఎన్నికల్లో హిందూపురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. తాము మమేకం కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్తున్నట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని ప్రధాన రైల్వేరోడ్డు విస్తరణ పనులు వేగవంతం అయ్యాయి. గతంలో సుమారు 70 శాతం రోడ్డుకు ఇరువైపులా ఉన్న అక్రమ భవనాలు, నిర్మాణాను తొలగించారు. మిగిలిన భవనాల కూల్చివేత పనులను రెండ్రోజులుగా మున్సిపల్ అధికారులు ముమ్మరం చేశారు. భవనాల తొలగింపులు పూర్తయిన వెంటనే ఇరువైపులా చెట్లును తొలగించి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర రావు తెలిపారు. భవన యాజమానులు కూడా స్వచ్ఛందంగా నిర్మాణాలను తొలగించుకోవాలన్నారు. పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. మిగిలిన 10 శాతం మంది ముందుకు వచ్చినా రాకపోయినా కలెక్టర్ ఉత్తర్వులతో భవనాలు తొలగిస్తామని వెల్లడించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

హిందూపురం టౌన్: మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఇందిరా పార్క్ నుంచి కార్మికులు ర్యాలీగా మున్సిపల్ కార్యాలయం చేరుకుని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఇంజినీరింగ్ కార్మికులకు సంబంధించి నూతన హాజరు విధానంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యను గుర్తించి ఈ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నరసింహప్ప, మల్లికార్జున, జగదీష ఆనంద్, మంజునాథ్, మూర్తి, నాగేంద్ర, చంద్ర, రామచంద్ర, కవిత, ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

నార్శింపల్లిలో ఎమ్మెల్సీ పర్యటన



రామలింగారెడ్డితో ముచ్చటిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రయ్య

గోరంట్ల: మండలంలోని నార్శింపల్లిలో గురువారం ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య పర్యటించారు. ఈ సందర్భంగా సీనియర్ రాజకీయ వేత్త , సామాజిక సేవకుడు రామలింగారెడ్డి స్వగృహానికి ఆయన వెళ్లారు. అక్కడ ఏర్పాటు చేసిన తేనేటీ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు హరినాథరెడ్డి, మాజీ సర్పంచ్ రెడ్డి పాల్గొన్నారు.